క్లుప్తంగా

పాఠశాలలపై చర్యలు తీసుకోండి

కనిగిరి రూరల్: విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. ఈ మేరకు శనివారం ఎంఈఓ డీవీ సుబ్బారావుకు వినతిపత్రం అందచేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు తాయిద్, ఈశ్వర్, ఖాజా, ఎరిక్షన్, బాబు, బాషా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

గుడ్లూరు: ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లును పోలీసులు శనివారం తెల్లవారుజామున స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మన్నేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం అందుకున్న ఎస్సై లక్ష్మణరావు సిబ్బందితో కలిసి గుళ్లపాలెం అడ్డరోడ్డు వద్ద కాపు కాసి రెండు ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని డ్రైవర్లను అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకై మంటలు



నిప్పంటుకున్న పూరిపందిరి

హనుమంతునిపాడు: స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లో న్యూడిల్స్ తయారు బండి వద్ద గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. మంటలు పక్కనే పూరి పందిరికి అంటుకున్నాయి. దీంతో స్థానికులు భయభ్రాంతులకు లోనై పరుగులు తీశారు. కొంత మంది ధైర్యంగా మంటలను అదుపు చేశారు. పందిరి మంటలకు కాలిబూడిదైంది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

లైసెన్స్ డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి



విత్తన షాపుల్లో తనిఖీలు నిర్వహిస్తున్న ఏఓ రాము

కందుకూరు: ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు ప్రభుత్వ లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయశాఖాధికారి వి.రాము సూచించారు. పట్టణంలోని పలు ప్రైవేట్ విత్తన షాపులను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లో ఉన్నత స్టాకు వివరాలు, ధరల పట్టికలను పరిశీలించారు. తొలకరి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డీలర్ల తప్పనిసరిగా రైతులకు కావాల్సిన వివిధ రకాల పంట విత్తనాలను అందుబాటులో ఉంచాలన్నారు. విత్తన నిల్వ పట్టికలో నిల్వస్టాకు, రేట్లు నమోదు చేయాలని, మొలక శాతం కట్టి రైతులకు విక్రయించాలని సూచించారు. విత్తనాలు అమ్మే వ్యాపారులు కచ్చితంగా అమ్మకం రసీదును రైతులకు ఇవ్వాలని ఆదేశించారు. అలాగే రైతులు కూడా తప్పనిసరిగా లైసెన్స్ ఉన్న ధ్రువీకరణ డీలర్ల దగ్గర మాత్రమే కొనుగోలు చేయాలని, తయారీ తేదీ, కాల పరిమితి చూసి కొనుగోలు చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు మొలకశాతం కట్టుకోవాలని, కొనుగోలు రసీదును పంటకాల పరిమితి ముగిసే వరకు భద్రపర్చుకోవాలని సూచించారు. డీలర్లు చట్ట ప్రకారం అన్ని నిబంధనలు పాటించాలని, లేకుంటే విత్తన చట్టం ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం రైతులకు అందుబాటులో నువ్వులు, కందులు, పెసలు, సజ్జలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే వ్యవసాయశాఖ ద్వారా పొద్దు తిరుగుడు రకం ఎన్‌డీయస్‌హెచ్ 1012(మినికిట్స్) రకం విత్తనాలను 100 శాతం రాయితీతో రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో కోదండరామస్వామి కల్యాణోత్సవం



మోపాడులో విశిష్ట అలంకరణలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులు

పామూరు: మండలంలోని మోపాడులో కోదండ రామస్వామి ఆలయంలో సీతారాముల దేవతా ఉత్సవమూర్తుల కల్యాణోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కృష్ణయ్య, రమేష్‌లు మొదట సీతారామ, లక్ష్మ, హనుమంతుని మూల విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం సీతారాముల పంచలోహ విగ్రహమూర్తులను మేళతాళాల నడుమ గర్భాలయం నుంచి కల్యాణవేదికకు తరలించి వేదమంత్రాల నడుమ వైభవంగా శాంతి కల్యాణం నిర్వహించి ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయంవద్ద భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ, భక్తులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దుండగులు



రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద దుండగులు పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

లింగసముద్రం: రాళ్లపాడు ప్రాజెక్టు కుడి కాలువ పక్కన ఉన్న 160 కేవీ ఆర్‌డబ్ల్యూఎస్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తుతెలియని దుండగులు శుక్రవారం అర్ధరాత్రి పగులగొట్టారు. దీంతో రెండు మంచినీటి పథకాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా ప్రాజెక్టు లోపలి ప్రాంతంలో ఉన్న ఇంటెక్‌వెల్‌లోని మోటార్లకు విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇంటెక్‌వెల్ నుంచి గుడ్లూరు-రాళ్లపాడు, రాళ్లపాడు-రోళ్లపాడు భారీ మంచినీటి పథకాలకు మోటార్ల ద్వారా పంపింగ్ జరుగుతుంది. ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టడంతో గుడ్లూరు-రాళ్లపాడు మంచినీటి పథకంలో 114 గ్రామాలకు, రాళ్లపాడు-రోళ్లపాడు పథకంలో 37 గ్రామాలకు మంచినీటి సరఫరా నిలిచిపోయింది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్‌కు సరఫరా అయ్యే వైర్లను కత్తిరించి విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం దిమ్మెపై ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందపడేసి దానికి ఉన్న కొంత కాపర్ వైర్‌ను దుండగులు తీసుకెళ్లారు. శనివారం ఉదయం మోటార్లు వేసేందుకు వచ్చిన వారు మోటార్లు వేయగా అవి పనిచేయలేదు. విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి చూడగా ట్రాన్స్‌ఫార్మర్ కింద పడేసి ఉండడాన్ని గమనించారు. ఈ విషయాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు తెలియజేశారు. దీంతో విద్యుత్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించారు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటరమణను వివరణ కోరగా ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టిన విషయాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావుకి తెలియజేయగా..ఆయన ఎస్ఈతో మాట్లాడి వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి మంచినీటికి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని చూడాలని చెప్పారు. దీంతో గుడ్లూరు నుంచి ట్రాన్స్‌ఫార్మర్‌ను తెప్పించి ఆదివారం మంచినీరు సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించండి



విద్యార్థి కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వెలిగండ్ల: క్రమశిక్షణతో చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యాకానుక కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరుతేవాలన్నారు. విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ రామన మహాలక్ష్మి, జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, ఎంఈఓలు దేవిరెడ్డి రామిరెడ్డి, దాసుప్రసాద్, సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు, హెచ్‌ఎం రాఘవాచారి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కనిగిరి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన, మెరుగైన విద్య అభిస్తోందని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు స్టూడెంట్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఎంఈఓల సంఘ జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు డీవీ సుబ్బారావు, యువీ నారాయణ రెడ్డి, జి.సంజీవి, జె.ప్రసాద్‌రావు, రాజాల కొండారెడ్డి,నాయకులు పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్

కనిగిరి రూరల్: జాతీయ లోక్ అదాలత్ ఈ నెల 29న స్థానిక కోర్టు ప్రాంగణంలో జరుగుతుందని కనిగిరి జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.భరత్ చంద్ర తెలిపారు. పోలీసులు రాజీ పడదగ్గ కేసుల పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి, ఎక్కువ కేసులు రాజీ చేసేందుకు కృషి చేయాలన్నారు. లోక్ అదాలత్‌లో కేసులు రాజీ అయితే ఇరు పక్షాలకు గెలుపే ఉంటుందని వివరించారు.

బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



మాట్లాడుతున్న ఆలయ కమిటీ చైర్మన్ పాపమర్తి మాధవరావు

సింగరాయకొండ: పాతసింగరాయకొండ శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో ఈనెల 16న ఆదివారం నుంచి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తయినట్లు ఆలయ ట్రస్టుబోర్డు కమిటీ చైర్మన్ పామర్తి మాధవరావు తెలిపారు. శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం బ్రహ్మోత్సవాలకు సంబంధించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి. కృష్ణవేణి మాట్లాడుతూ ఆదివారం రాత్రి అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. సోమవారం మధ్యాహ్నం ధ్వజారోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాల అసలు ఘట్టం ప్రారంభమవుతుందని సాయంత్రం నుంచి స్వామి వారు చంద్రప్రభ వాహనంలో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. ఈనెల 23వ తేదీ ఆదివారం కళ్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం ఉంటాయని, 26వ తేది రాత్రి పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. ఈ సంవత్సరం దాతల సహకారం మరువలేనని ఆలయానికి అనేక వసతులు కల్పిస్తున్నారని ఆమె వివరించారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి వెంకట లక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై డీఎంహెచ్ఓ విచారణ



వైద్యశాలలో విచారణ చేస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సురేష్‌కుమార్

పామూరు: వైద్యశాలలో వైద్యుల నిర్లక్ష్యం, అసాంఘిక కార్యకలాపాలపై వైద్యసిబ్బంది, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై జిల్లా వైద్యశాఖాదికారి డాక్టర్ సురేష్‌కుమార్ శనివారం బొట్లగూడూరు వైద్యశాలలో సిబ్బంది, గ్రామస్తులతో క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. ఈసందర్భంగా గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త, టీడీపీ రాష్ట్రకార్యదర్శి కోటపాటి జనార్దన్‌లు డీఎంహెచ్‌ఓతో మాట్లాడుతూ వైద్యశాల విధులకు డాక్టర్‌లు సరిగా హాజరుకావడంలేదని దీంతో వైద్యసేవలు పడకేశాయన్నారు. వైద్యశాలలో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని, ఈవిషయం బొట్లగూడూరు, రేణిమడుగు, మోపాడు, అపమాంబాపురం, కంబాలదిన్నె గ్రామస్తులు తమ దృష్టికి తీసుకువచ్చారని, తక్షణం దీన్ని నిలువరించాలన్నారు. మరోమారు ఇలా జరగకుండా చూడాలని డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేశారు. వైద్యసిబ్బంది ఇచ్చిన ఫిర్యాదుపై కూడా డీఎంహెచ్ఓ సిబ్బందితో విచారణ చేశారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వర్తించాలని, మారోమారు ఇలాంటి ఫిర్యాదు వస్తే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్ఓ ఎ.సృజన, నాయకులు పువ్వాడి వెంకటేశ్వర్లు, అడుసుమల్లి ప్రభాకర్, సర్పంచ్ వై.బాల, అనపర్తి శశిమహేశ్వరరావు, కోటపాటి నరసింహారావు ఉన్నారు.

బాలికలు విద్యను అందిపుచ్చుకోవాలి



బాలికలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు

ఉలవపాడు: బాలికలు విద్యను అందిపుచ్చుకోవాలని కందుకూరు డిప్యూటీ డీఈఓ ప్రసాదరావు అన్నారు. ఉలవపాడులోని నేను బడికి వస్తా కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన మాట్లాడారు. ఆడపిల్లలు సామాజిక అసమానతల కాలం నుంచి బాల్యవివాహాలు లాంటి వాటిని తొలగించుకుని విద్యపై దృష్టి పెడుతున్నారన్నారు. బాలికలు చదువులో మరింత రాణించేందుకు ముందుడుగు వేయాలన్నారు. ఆడపిల్లలు ఎదుర్కొంటున్న పౌష్టికాహార లోపాన్ని అధిగమించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ వీరయ్య మాట్లాడుతూ బాలికలకు మంచి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని బాగా చదువుకోవాలన్నారు. ఎంఈఓ రమణయ్య మాట్లాడుతూ చట్టపరమైన హక్కులు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. బాలికలు బాలురతోపాటు అన్నిరంగాలలో ముందుండాలన్నారు. బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. బడికి రాని పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఎస్‌పీడీ శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయుడు శివనాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

వెలిగండ్ల: ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ రామన మహాలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొన్నారు. విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ మార్చమంటే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారని, సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామన తిరుపతిరెడ్డి, ఎంపీడీఓ రామచందరరావు, తహసీల్దార్ దానియేల్, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తప్పనిసరి

కందుకూరు: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో స్కూల్‌లు, కాలేజీల బస్సులు తప్పనిసరిగా రవాణాశాఖ నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకోవాలని మోటార్ వాహనాల తనిఖీ అధికారి ఎస్‌కే ఎండీ రఫి తెలిపారు. కందుకూరు ఎంవీఐ పరిధిలో ఇప్పటి వరకు 50 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. విద్యా సంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్కూల్, కాలేజీ బస్సులపై ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. తనిఖీల్లో ఫిట్‌నెస్ లేకున్నా, ట్యాక్స్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకపోయినా, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించినా, అతివేగంగా స్కూల్ బస్సులు నడిపినా ఆ వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. విద్యా సంస్థలకు సంబంధించిన బస్సులు నడిపే డ్రైవర్లు 60 ఏళ్ల లోపు వారై ఉండాలని సూచించారు. నిబంధనలు కచ్చితంగా పాటించాలని లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సోదరభావంతో మెలగాలి

మద్దిపూడి: ఈ నెల 17న జరగనున్న బక్రీదు పండగ పురస్కరించుకుని గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సోదవభావంతో మెలిగి ప్రశాంతమైన వాతావరణంలో పండగ జరుపుకోవాలని ఎస్ఐ సీహెచ్ శివబసవరాజు శనివారం తెలిపారు. బక్రీదు పండగ సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం సామాజిక వర్గం నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలల్లో ఎలాంటి గొడవలకు తావులేదన్నారు. ఈ నెల 17న జరుగనున్న బక్రీదు పండగ ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గ్రామస్తులు పోలీస్‌లకు సహకరించాలని సూచించారు. ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



విద్యార్థులకు కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలోజరిగిన స్టూడెంట్స్ కిట్స్ పంపిణీలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని పాఠశాలలో ఉన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. డిప్యూటీ డీఈఓ ప్రసాద్ బాబు, ఎంఈఓ సుబ్బారెడ్డి, హెచ్‌ఎం ద్వారకారాణి తదితరులు పాల్గొన్నారు.

మాలకొండ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాన్ని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు కుటుంబసభ్యులతో దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఈఓ కేబీ శ్రీనివాసరావు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు స్వాగతం పలికారు. ఆలయ ప్రధాన అర్చకుడు గౌరి శంకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోశాలను సందర్శించి గోవులకు ఆహారం వేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఈఓకు సూచించారు. టీడీపీ మండల అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరావు, గుడ్లూరు అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పొగాకు గరిష్ట ధర రూ. 330

కొండపి (సింగరాయకొండ): కొండపిలోని స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం నిర్వహించిన వేలంలో పొగాకు గరిష్ట ధర కిలో రూ. 330 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. వ్యాపారులు చోడవరం, ముప్పవరం గ్రామాలకు చెందిన రైతులు 1073 బేళ్ళు తీసుకొనిరాగా 1027 బేళ్ళు కొనుగోలయ్యాయి. వ్యాపారులు వివిధ కారణాలతో 46 బేళ్ళను తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 330, కనిష్ట ధర రూ. 205, సరాసరి ధర రూ. 264.49 పలికింది. వేలంలో 27 మంది వ్యాపారులు పాల్గొన్నారు. ఆదివారం సెలవు, సోమవారం బక్రీద్ సందర్భంగా వేలానికి సెలవు ప్రకటించినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు.

టంగుటూరు: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో శనివారం జరిగిన వేలంలో పొగాకు అత్యధిక ధర కేజీ రూ. 321 అత్యధిక ధర పలికింది. కమ్మవారిపాలెం, కట్టుబడిపాలెం గ్రామాలకి చెందిన రైతులు 970 బేళ్ళను వేలానికి తీసుకురాగా వాటిలో 917 కొనుగోలు జరగగా, 53 బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 331 కాగా, కనిష్ట ధర రూ. 205 పలకగా, సరాసరి రూ. 276. 45 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 40 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ.11,90,912

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.11,90,912 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. కుంకుమార్చన రూ.24,360, తలనీలాలు రూ.63,150, ప్రత్యేక దర్శనం రూ.4,05,100, లడ్డుప్రసాదాలు రూ.2,06,070, అన్నదానం రూ.4,09,642, రూంఅద్దెలు రూ.24,120 వచ్చినట్లు పేర్కొన్నారు.

గ్రంథాలయ సెస్ వసూలు చేయండి

ఉలవపాడు: పంచాయతీల నుంచి గ్రంథాలయ పన్ను వసూలు చేసి జమ చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. స్థానిక గ్రంథాలయాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీల్లో సెస్ పూర్తిగా కట్టలేదని, ఈ సెస్‌ను సక్రమంగా సంస్థకు జమ అయ్యేలా చూడాలన్నారు. గ్రంథాలయంలో ఎక్కువ మంది సభ్యులను చేర్పించాలని తెలిపారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వేసవి శిక్షణా తరగతులు విజయవంతంగా నిర్వహించిన గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావును ప్రత్యేకంగా అభినందించారు.